అవసానం

రోగుల మూలుగులూ, శిశువులవార్డునించి వినిపిస్తున్న ఏడ్పులూ, బైటినించి విన్పిస్తున్న వానగాలి హోరులో అంతగా వినిపించడంలేదు. ప్రమాదాలకు లోనైనవార్ని పడుకోబెట్టివున్న వార్డులో మూడవమంచంమీద పడుకుని రక్తం గడ్డగట్టే ఆ చలిలో ఆస్పత్రిలోపల వెచ్చగా పడుకోగలిగినందుకు కొంత తెలిసీ తెలియని సంతోషంతోటి పెద్దఅద్దాల కిటికీలోనుంచి బైటికి కనిపిస్తున్నంతవరకు చూస్తున్నాడు ప్రసాదరావు.

తెల్లని ఆస్పత్రి గోడలూ ఏవో మందులవాసనా, అప్పుడప్పుడు వచ్చిపోతున్న నర్సుల బూట్ల టకటకలూ ప్రసాదరావుకు మగతగా వినిపిస్తున్నాయి. స్ఫురిస్తున్నాయి. అతనికి వొళ్ళంతా కట్లు వేశారు. ఎటూ కదలటానికి వీల్లేదు. తలమాత్రం పక్కకిపెట్టి కిటికీనుండి బైటికి చూస్తున్నాడు.

బాగా చీకటి పడలేదింకా.

మసకబారే వెల్తురు, మబ్బులు కమ్మివుండటంవల్ల భయంకొల్పుతోంది. సన్నగా చినుకు రాలుతోంది గావును కిటికీ అద్దాలు స్పష్టంగాలేవు. అయినా ఏదో కన్పిస్తోంది.

ఆస్పత్రి కాంపౌండ్ కవతలవున్న పెద్దవేపచెట్టు చీకటి నిలయంగా గాలికి వూగుతోంది. ఆకులులేని కొమ్మలు వికారంగా కన్పిస్తున్నాయి. ప్రసాదరావు ఇందాకణ్ణించి అటే చూస్తున్నాడు. అతను ఆ కారు ప్రమాదానికి గురైస్మృతి తప్పి ఇప్పటికి వారం అవుతోంది. ఇవ్వాళ్ళ ఉదయంనించే పరిసరాన్ని గుర్తించే బాహ్యజ్ఞానం కలిగింది.

ప్రసాదరావుకు పాతికేళ్ళుంటాయి. 'ఫరవాలేదు' అనుకోగలిగే స్ఫురద్రూపి. వొడ్డూ పొడుగ్గా వుంటాడు అతని ఆలోచనలు చాలా మసకమసకగావుండి బైటవాతావరణంలాగే అస్పష్టంగా అస్థిమితంగా వున్నాయి.

అతను వూగేచెట్టువంక చూస్తూ, తన గత జీవితాన్ని ఎందుకో నెమరువేసుకుంటున్నాడు. ఆ చెట్టుకింద రోడ్డుమీద గొడుగులేసుకుని తొందర తొందరగా యిళ్ళకు వెళ్ళేవాళ్ళు కన్పిస్తున్నారు. ఓ కుర్రాడు నెత్తిని తుండుగుడ్డ కప్పుకుని పరిగెత్తాడు. ఇదంతా లీలగా గోచరిస్తోంది ప్రసాదరావుకి. ఆ కుర్రాడు తనకేదో తీరని వ్యధని రగిల్చిపోయినట్టూ, తన ఆశలన్నీ ఆ కుర్రాడు వెళ్ళిపోవడంతో పోయినట్టూ వూహించుకుని బాధపడసాగాడు ప్రసాదరావు. అతని శక్తిలేని శరీరంలో నరాలు దడదడలాడాయి. అతని హృదయంలో దావానలం రగుల్కొన్నది.

ఆ కుర్రాడి నడక, వాలకం అన్నీ ప్రసాదరావు మెదడులో ఒక్క క్షణంపాటు విప్లవాన్ని రేపినై. బాబు అంతా ఇలాగే వుండేవాడు...

ప్రసాదరావు ఇక ఆ చెట్టువంక చూడలేకపోయినాడు. అసలు చూడడానికి వీలులేదు గూడాను. ఆస్పత్రి వార్డులలో దీపాలు గప్‌మని వెలిగాయి. విద్యుద్దీపాల కాంతి అన్ని విశాలమైన గదుల్ని ఆవరించుకుంది.

ఆస్పత్రిలో ఎక్కడో వున్న గోడగడియారం ఏడు కొట్టిన శబ్దం చాలా అస్పష్టంగా వినిపించింది. బైట గాఢాంధకారం. వాన, గాలి. ప్రసాదరావు విసుగ్గా తలతిప్పేసుకుని పైకప్పు వంక చూస్తూ పడుకున్నాడు.

ప్రసాదరావు కళ్లు మూసుకుని ఆలోచిస్తూవుండగానే బూట్ల టకటక వినిపించింది. చాలా పరిచయమైనస్వరం. అందులో ఎంత ఆప్యాయత, కరుణ తొణికిసలాడతాయి! ''కాస్త నోరు తెరవండి, మందు తాగాలి!'' అంది.

ప్రసాదరావు ఉదయంనించి ఈ నర్సుకోసం ఎదురుచూస్తున్నాడు ఎవరో బంధువుకోసం ఎదురుచూసినంత ఆదుర్దాతోటి.

'' ఉం...'' అని మూలుగుతూ మెల్లిగా నోరు తెరిచాడు. హాలాహలంలాంటి చేదుద్రవాన్ని ఆమె నిదానంగా పసిపిల్లవాణ్ణి బుజ్జగిస్తున్నట్టుగా అతని పెదిమ పట్టుకొని నోట్లో చుక్కలు చుక్కలుగా పోసింది. ప్రసాదరావు మందు చాలా అయిష్టంగామింగి, '' ఎందుకు సిస్టర్, నాకీమందులూ మాకులూ, కాస్త విషంపోసి కడతేర్చరాదూ.'' అన్నాడుగొణుగుడుగా.

'' ఎక్కువగా మాట్లాడకండి. మే మిక్కడ వున్నది మందులు పొయ్యడాని కేనండి.'' అంది నర్సు అతనివంకచూస్తూ. ఆమె తేజోవంతమైన ముఖవర్చస్సూ, ధగధగలాడే రెండు జ్యోతుల్లాంటి కళ్లూ, ఒక మాతృదేవికి వుండవలసిన దయనూ, జాలినీ ప్రతిఫలిస్తున్నాయి. ప్రసాదరావు ఐదారునిమిషాలు అలాగే ఆమెవేపే నిశ్చలంగా చూస్తూవుండి ఒకసారి బాధతోటి మూలిగి ''నాతో ఏదైనా మాట్లాడు సిస్టర్, నాకోసం వచ్చేవాళ్ళెవరూ లేరు. నన్ను కాస్త మాట్లాడనియ్యి. లేకపోతే నా మెదడు పేలిపోతోంది'' అన్నాడు చాలా నీరసంగా నిదానంగా - అయితే ఎంతో బాధగా.

నర్సు అతని పక్కనే నిలబడి, అతనిజుట్టు నిమురుతూ '' ఇంకా చూడవల్సినవారున్నారు. చూసివస్తాను. మిమ్మల్ని మాట్లాడనియవద్దు అని డాక్టర్ చెప్పి వెళ్ళారు. మీకు మాట్లాడకపోవటమే బాధ ఐతే ఏదో కాసేపు మాట్లాడుకుందాం. కొంచెం కాఫీ తాగుతారా'' అని ప్రశ్నించింది.

ప్రసాదరావు తలవూపాడు ఆమోదకరంగా.

నర్సు పక్కనేవున్న చిన్న వలల బీరువా తెరిచి అందులోవున్న ఫ్లాస్కునుంచి కాఫీ గ్లాసులోపోసి అతనికి నాలుగు గుక్కలు పట్టింది? ''నే మళ్ళీవస్తా. వూరికే కొరగాని ఆలోచనలు చెయ్యకండి దయచేసి. టెంపరేచర్ పెరుగుతుంది'' అని హెచ్చరికచేసి నర్సు మిగతా మంచాల దగ్గరికి వెళ్ళిపోయింది.

ప్రసాదరావు ఆమె వెళ్తోంటే ఆమె వేపే తిరిగిచూస్తూ వుండిపోయినాడు. బక్కపల్చగావుంది. అందంగానే వుందేమో ఆమెలోని ఆకర్షణ ప్రసాదరావులో ఒక పూజ్య భావాన్నీ దానికి విరుద్ధమైన చపలత్వాన్నీ సైతం రెచ్చగొట్టాయి. ఆమె నల్లటి మెరిసేకళ్లు, సన్నని ఎర్రని పెదాలూ, మృదువైన స్వరమూ, తనకు స్మృతికలిగిన తొలి క్షణం నుంచీ బాగాపరిచయమైనాయి. ఆమె ఉదయం

తనకుమందిచ్చి కాఫీ ఇచ్చి వెళ్ళింది. తిరిగి రాత్రిడ్యూటీకి వస్తుందని ఇందాకటి ఇంకోనర్సు అన్నది. ఆ నర్సుకీ ఈమెకీ ఎంత తేడా ! ఆ నర్సు తనది 'డ్యూటీ' అని భావిస్తున్నట్టే యాంత్రికంగా చూసింది. ఈమె! తల్లిలాగా, సోదరిలాగా, ప్రేమగా, దయగా .... ప్రసాదరావు ఆమెకోసం నిరీక్షిస్తూ ఏదో వూహిస్తూ పడుకున్నాడు.. తనలో తెములుతున్న ఆలోచనల్ని ఎవరికన్నా చెప్పెయ్యకపోతే తల పగిలిపోతుందనిపిస్తున్నది అతనికి. ఆమె విని 'అయ్యోపాపం!' అని హృదయపూర్వకమైన జాలి ప్రకటిస్తే తనకు కొంతలో కొంత ఉపశాంతి చిక్కుతుందని ఒకవెర్రి ఆశ.

2

ఇప్పుడు ఆస్పత్రి గోడగడియారం ఎనిమిది కొట్టింది టంగుటంగుమని. ఇందాకటికన్న ఇప్పుడాధ్వని మరింత స్పష్టంగా వినిపిస్తోంది. బైట ప్రకృతి కల్లోలంగూడా ఉపశమించింది. కాని, చీకట్లు మాత్రం దట్టంగానే వ్యాపించివున్నాయి. రోడ్డు దీపాల వెలుగు దూరంగా మసకగానే కన్పిస్తోంది అద్దాలకిటికీ గుండా. ఆస్పత్రి కిటికీలనుండి దీపం వెలుగు వేపచెట్టుమీద ప్రసరిస్తోంది. ప్రసాదరావు బరువైన మనస్సును స్తిమితపర్చుకోటానికి ప్రయత్నించినప్పుడల్లా ఇందాకటి ఆ కుర్రాడూ, నర్సూ జ్ఞాపకం వచ్చి బాధపడి పోతున్నాడు.

రోగుల మూలుగు ఇందాకటికంటె తగ్గింది. చలికీ, నర్సులుపోసిన నిద్రమందుల ప్రభావానికీ లొంగిపోయారు గావును, రోగులు చాలామంది నిద్రట్లో పడ్డారు.

ఆస్పత్రి వాతావరణం ప్రశాంతిలో పడింది.

మరొక్క అరగంట గడిచింది. నర్సు నిదానంగావచ్చి ప్రసాదరావు ప్రక్కనేవున్న ఇనపకుర్చీలో కూర్చుంటూ, '' ఎందుకండీ రమ్మన్నారు? నాకో అరగంట వ్యవధివుంది, ఏదైనా మాట్లాడండి'' అన్నదామె చిన్నగా నవ్వి.

ప్రసాదరావు ఆమెవేపు కన్నార్పకుండా చూశాడు. ఆమె తన 'విధి' ని నెరవేరుస్తున్నట్టా! తన కథలో ఆసక్తివుండి ప్రశ్నిస్తున్నట్టా?... ఏమైనా చెప్పితీరాలి. ఈ తీరని మనోవ్యధనుభరించటం కష్టసాధ్యం... 'సిస్టరు, చెప్పనా!' అన్నాడు.

''చెప్పండి! క్లుప్తంగా మాట్లాడండి వీలున్నంతవరకు! ఏం?'' అన్నది ఆమె.

''నీ పేరేమిటి?'' అని అడిగాడు రోగి.

''కళ్యాణి'' అన్నది సిస్టర్.

''మంచిపేరు! కల్యాణీ! నాకు రాను రాను జీవితం మీద విరక్తి ఏర్పడిపోతోంది. నేను కారు ప్రమాదంలో చిక్కింది అకస్మాత్తుగా కాదు. కావాలని వెళ్ళిపడ్డాను. దాన్నెవరూ గుర్తించలేదు....''

''ఆఁ! మీ అంతట మీరేవెళ్ళి ఆ కారుకిందపడ్డారా?'' కళ్యాణి ఆశ్చర్యపడింది.

''ఏం చెయ్యను! చదువు మానేసి ఎన్నాళ్ళయింది! ఎన్నేళ్ళయింది! కళ్యాణీ! నిరుద్యోగం అంటే దానివెనుక ఎంతదారిద్ర్యం! ఒక్క సంవత్సరంలో తల్లిదండ్రులు పోయినారు... వాళ్ళు ముసలివారు, పోయినారంటే సహజం. కాని నా తమ్ముడు పన్నెండేళ్ళవాడు....'' ప్రసాదరావు ఆగిపోయినాడు.

కల్యాణి '' ఏమైంది కుర్రాడికి?'' అని అడిగింది ప్రేమగా. ఆమె కళ్ళలోని ప్రేమ వాత్సల్యం ప్రసాదరావుపై మంచుతుంపరలా వర్షిస్తున్నదేమోనన్న భ్రమ ఎవరికైనా కలుగుతుంది.

''కుర్రాడు నాకు మల్లేనే వుండేవాడు సిస్టర్. హైస్కూల్‌లో సెకండ్‌ఫారం చదువుతున్నాడు.'' ఆమె మూర్తి ప్రసాద రావును కదిలిస్తోంది. అతనిలోని ఉద్వేగాలు కట్టలు తెంచుకున్నాయి. అతను కల్యాణి ఎర్రని పెదాలవంక చూస్తూ రెండు నిమిషాలు ఆలోచన మానేశాడు. విద్యుద్దీపపు కాంతి ప్రతిఫలిస్తున్న ఆ ఎరుపు అతనికి కొత్తగా, వింతగా అవుపిస్తోంది.

కల్యాణి '' ఇప్పుడు మీ తమ్ముడేం చేస్తున్నాడు? ఎక్కడ వుంటున్నాడు?'' అని అడిగింది.

''తల్లిదండ్రులుపోయినశోకంతోటి మంచంపట్టాడు; ఎవరెవరో సాయం చేశారు, లేదనను; కాని ధర్మాస్పత్రి మందుకు లొంగకనే టైఫాయిడ్‌తో వాడూ పోయినాడు... సిస్టర్! మరణమంటే నాకు భయంలేదు... పదహారేళ్ళు భుజానమోసికూడా బడికి తీసుకెళ్ళి - టైఫాయిడ్ కప్పగించా తమ్ముణ్ణి... తీవ్రమైన విరక్తితోటి వొచ్చి రొడ్డుమీదనిల్చున్నా... జేబు ఖాళీగా వుంది ఇంటికెళ్ళటానికి భయం... ఇల్లు బావురు మంటున్నది... ఏటు చూసినా తమ్ముడి విగ్రహమే ప్రత్యక్షమవుతుంది... ఆమూల తలుపు దగ్గిర కూచుని వాడు లాంతరు వెలుగులో చదువుకోడం, దొడ్లో చిక్కుడు పాదుకింద నీళ్ళు పోసుకుంటూ ''అన్నయ్యా! లెక్కలు వేసి చూపించవూ?'' అనడమూ, రాత్రిళ్ళు నా పక్కనే పడుకుని '' ఇంగ్లీషు 'నాండిటెయిల్' కథ తెలుగులో చెప్పు అన్నయ్యా!'' అంటూనే నన్ను కావలించుకుని నిద్రపోవడమూ నా మనస్సును చిత్రవధ చేస్తున్నాయి సిస్టర్...

''అందరి వంటివాడు కాదు నా తమ్ముడు. కుటుంబ పరిస్థితులు తెలుసుకున్నవాడు గావటంవల్ల అందరు పిల్లలకి మల్లె 'కొనుక్కుతింటా' అనైనా అడిగేవాడు కాదు... మూడుపూటలు అన్నం... వుంటే - లేదా రెండుపూటలే. అమాయకుడైన కుర్రాడికి సైతం మా యింట్లో ఆర్థికదారిద్ర్యం పాఠాలు నేర్పింది. ఘోరంగా లేదూ సిస్టర్... ఈరోజుననేను ఎవరూ లేనివాణ్ణయిపోయినాను తమ్ముణ్ణి శ్మశానంలో అప్పజెప్పి తిరిగి తడిగుడ్డలతో ఇంటికి వస్తోవుంటే ఆ కారు ఎదురుపడింది.''

ప్రసాదరావు ఆగిపోయినాడు దుఃఖభారంతో బొంగురు పోయినగొంతుక సవరించుకుంటూ.

నర్సు - కల్యాణి కంట్లో జాలి శోకంగా మారింది. కళ్ళల్లో రెండు బొట్లు కన్నీళ్లు మెరిసాయి. ''పాపం! అందుకని ఆత్మహత్య కొడబడ్డారా! తప్పుకాదూ? ఆశ కలిగి వుండాలండి...'' అన్నదామె.

''ఆశ! ఏమి ఆశతోటి బ్రతకమంటారండి? నా అన్నవారందరూ పోయినాక ఎవరికోసమండీ? నా కోసమే నంటారేమో! నాకైనా ఉద్యోగం దొరకలేదు... దొరకదు. ఇంక ఏం చూసి...?'' అని ఆగాడు ప్రసాదరావు ఆయసంతోటి.

నర్సుకిప్పుడు ఇతని నెలా ఓదార్చాలో స్ఫురించలేదు. ఎలా ఇతనిలో ఆశగలిగించడం? లేకపోతే బ్రతకడే... ఆ గాయాలూ, టెంపరేచర్ - ఎలా నయమౌతాయి? ప్రమాదమే.... ఆమె కొక ఆలోచన కలిగింది. ''మిస్టర్ ప్రసాదరావు! మీ రొక్కరే అలాంటి అభాగ్యులుకారు... ఎందరున్నారో! నేనే.... వున్నాను'' ... అని ఆగిపోయింది.

''చెప్పండి. మీరూ నాకు మల్లేనేనా?... పాపం!'' అని జాలిపడ్డాడు రోగి. అతని ఆలోచనలు ఇప్పుడు నర్సువేపు మళ్ళినయి.

కల్యాణి ''మీరు బాధపడుతున్నారు. మీ బాధ నాకథవిని అధికమౌతుందేమో!'' అన్నది.

''ఫర్వాలేదు, చెప్పండి'' అన్నాడు ప్రసాదరావు ఆసక్తిగా ఆమె ప్రకాశవంతమైన, స్వచ్ఛమైన కళ్ళల్లోకి చూస్తూ.

కళ్యాణి ఒకసారి ముంజేతి గడియారం వంక చూసి, ''అరగంట అయింది. వెళ్ళివస్తాను, మళ్ళీ అరగంట కూర్చోవచ్చు. మీరేమీ అధైర్యపడకండి. మీకెవరూ ఆత్మీయులు లేరనుకోకండి. నేనున్నాను'' అన్నది తగని కరుణ వుట్టిపడే స్వరంతో.

ఆమె వెళ్లినవేపే చూస్తూ ప్రసాదరావు కిటికీవైపు తిరిగాడు. వేపచెట్టు కన్పించనంత చీకటి. రోడ్డు నిరామయంగా వుంది. తన జీవితం గూడా ఇలా నిర్మానుష్యమై - ఆ వేపచెట్టులా అంధకారంలా, దెయ్యంలా నిలబడి ఘనీభవిస్తోంది.

3

తిరిగి నర్సు వొచ్చి ప్రసాదరావు పక్కనే కూర్చుంది. '' ఇంకా నిద్రపోలేదూ మిస్టర్?'' అన్నది. రోగికి తిరిగి కాఫీ ఇచ్చింది. ప్రసాదరావు ఏమీ మాట్లాడకుండా పడివున్నాడు, ఆమె చెప్పేది విందామని... కల్యాణి అతనికి మందుకూడా ఇచ్చి, ''నాకూ జీవితమంటే విరక్తిపుట్టిపోయింది... ఇలా నర్సుపని చేసుకుంటూ బతికున్నాను. నన్నుచూసి ఎవరూ జాలిపడరు. '' ఏం రోగమా?.నెలకు డెబ్బయి ఐదూ తింటూను!'' అంటున్నారు... మీరేచెప్పండి. ఇదేనా సుఖం? సంసారం చేసుకుంటూ...'' సిగ్గో భయమో, ఆగిపోయిందామె.

''అనుకుంటే ఏదైనా సుఖమే!'' అన్నాడు ప్రసాదరావు. ఇతర్లకయితే ఉపదేశం చెయ్యటం ఎంత తేలిక! అనుకున్నది నర్సు.

''ఇంత లేతవయస్సులో విరాగిఅయి ఏకాంతంగా జీవించడం కష్టం కదండీ?'' అన్నది ఆమె ఏదో బాధపడుతున్నట్టే.

''వొంటరితనమెందుకండి? మిమ్మల్ని నిక్షేపంగా ఎవరు పడితే వాళ్లు చేసుకోరూ?'' అన్నాడు ప్రసాదరావు.

కల్యాణి కొంచెం రూక్షణస్వరంలో ''నాకు పెళ్ళి అయింది...'' అన్నది

''అలాగునా?'' అన్నాడు రోడి, గుండెలెందుకో వేగంగా కొట్టుకున్నాయి.

అతని వైరాగ్యం కల్యాణికి స్ఫురించింది. ''పెళ్ళయి ఏం సుఖపడ్డాను? భర్త రెండో ఏటనే పోయినాడు. అక్కణ్ణించి ఏంచెయ్యాలో తోచక దిగులుపడి కూర్చున్నాను కొంతకాలం; మనం వూరుకుంటే ఆకలి వూరుకుంటుందా? ఎలాగో తిప్పలుపడి నర్సింగ్ కోర్సు పూర్తిచేసి ఇందులో చేరాను. ఎన్నిబాధలు పడ్డాను... ఇప్పుడు ఒంటరిదాన్ని. మా అమ్మ ఎప్పుడో చనిపోయింది. కళ్లులేని తండ్రి ఇంట్లో మంచంపట్టి వున్నాడు... ఆయనకు మతి చాంచల్యం... ఆయన నాతో మాట్లాడడు... ఇంటికిపోవడానికే భయం. అంతా శూన్యమండి! నేను నా భర్తని ప్రేమించినదాన్నే - ఆ తీగ అలాగే తెగిపోయి వేళ్ళాడుతోంది.... నేను ఎలాగో ఆశతోటి జీవిస్తున్నాను... మీరూ అలాగే..... చూడండీ! దిగులు పెట్టుకోకండి'' అన్నది కల్యాణి.

ప్రసాదరావు దయగా, ఆశగా ఆమెలోకి చూశాడు.

''నేను వెళ్తానండి. వెళ్ళి టీ తాగివస్తాను. లేకుంటే నిద్ర ముంచుకొస్తుంది. మీరు వూరికే దిగులు పెట్టుకోకండి!......'' అనేసి లేచి వెళ్ళింది నర్సు.

ప్రసాదరావు మనస్సులో ఒక ఆలోచన ఆశతోటి కలిసి త్రుటిలో పెరిగి పెద్దయింది. బైట ఆకాశంలో మబ్బులలో నుంచి దశమి చంద్రుడి గుడ్డివెన్నెల అతిదారుణంగా, వెకిలిగా వేపచెట్టుమీద పాకుతోంది. ఆకులులేని ఒక కొమ్మ మీద ఓ కాకి కూర్చుని తెల్లారిందో అని భ్రమపడి రెక్కలు టపటప లాడించి ఒకసారి 'కా కా' అని అరిచింది.

కల్యాణిమీద ప్రసాదరావుకు ఒకరకం వ్యామోహం కలిగింది. ఇద్దరు వొంటరిగాళ్ళు. ఇద్దరి స్థితిగూడా వొకటే.... ఆమె ఒకవేళ తనను ప్రేమించవచ్చును. ఏం? ఎందుకు ప్రేమించరాదు?

తిరిగి ఆమెవొస్తే బాగుణ్ణు.... ఆమె తనపక్కనే కూర్చుని మాట్లాడుతూవుంటే తన శారీరక, మానసిక బాధలు తగ్గిపోతాయి. తనలో ఎక్కడలేని ఆశలూ చిగురుస్తాయి. ప్రసాదరావు వూహల్లో పడి, కళ్లుమూసుకుని ఇందాకణ్ణించి చావు తప్ప గతిలేదనుకున్న వాడల్లా, ' ఎల్లాగైనా బ్రతకాలి' అనే ఆలోచించసాగాడు. కల్యాణి మూర్తిలోని ప్రతి అందాన్ని తూచి వర్ణించుకుంటున్నాడు అతను.

'ఆమెలో సహృదయం, ప్రేమ వాత్సల్యాలు లేకపోతే అందరు రోగులకంటె తనపట్ల ఇంత ఔదార్యంచూపిస్తుందా?'' అనే దొక ఊతగా పరిణమించిందతని మనస్సుకి.

4

రాత్రి పన్నెండుదాకా తిరిగి కల్యాణి అటువేపు రానేలేదు. పన్నెండింటికి ఒకసారి వచ్చి అందరి రోగులకూ టెంపరేచర్ తీసుకుని మందులియ్యవల్సినవారికి మందులిచ్చి - వరుసగా అందర్నీ చూస్తూ ప్రసాదరావు దగ్గరకి వచ్చింది. ఆమె వొచ్చి చూసేటప్పటికి ప్రసాదరావు కొంచెం నిద్రలో వున్నాడు. కల్యాణి అతనిప్రక్కనే వున్న ఇనపకుర్చీలో కూర్చుని ఆప్యాయంగా అతనిలోకి చూసింది.

ఇంతవరకు తాను చూసివున్న వందలకొలది రోగులందరికంటే ఇతను భిన్నంగా వున్నాడు. అతన్ని ఓదార్చి నయంచేసి పంపడం ఇక్కడ వున్నవారి ధర్మం... ప్రత్యేకం తన విధి... రోగులు రకరకాల కథలు చెప్పేవారు తనకు. అన్నీ విని వాళ్ళకు తగిన సమాధానం చెప్పి, ' ఈ అమ్మాయి మంచిది' అనిపించుకున్నది తను. ఈరోజున ఇతను సరికొత్త కథ చెప్పాడు - తను ఎన్నడూ వినని కథ.

ప్రసాదరావు నిద్రమందుశక్తికి బడి మగతలో పడివున్నా ఏదో కలవరిస్తున్నాడు. మొహంలో భావాల మార్పు అతను కంటున్న కలల్ని ప్రతిఫలిస్తున్నాయి.

. కల్యాణి చెరిగిపోయిన దుప్పటి సరిగ్గాకప్పిందతనికి. ఆమెకి ఏదో ప్రత్యేకమైన శ్రద్ధ కలిగిందతని మీద. ఇతన్నింక పదిరోజులకల్లా 'డిస్చార్జి' చేసేస్తారు. ఆ రోజున బైట దిక్కులేని ఇతన్ని - నీరసుడైన ఇతన్ని ఎవరుతీసుకెళ్ళిపోషిస్తారు? .... పాపం!

ఆమెలోని సహజమైన వాత్సల్యప్రవాహం కట్టలు తెంచుకుని ప్రవహిస్తోంది. తను తీసుకెళ్ళి మరొక పదిహేనురోజులు పోషించి పంపిస్తే కాస్త దృఢంగా వుండి, ఏదైనా పనిలోకి చేరే వోపికలో వుంటాడు మనిషి. చదువుకున్నవాడులా కన్పిస్తున్నాడు.

మనిషి మనిషికి చెయ్యవల్సిన కనీస సేవకదా అది! అని సమర్థించుకున్నదామె.

తెల్లారి ఆమె డ్యూటీ దిగి వెళ్ళేప్పుడు అతన్ని పలకరించి ''అధైర్యపడకండి ప్రసాదరావుగారు! కోట్లమంది బ్రతికే ఈభూమిపై మీ కొక్కరికే స్థానం లేదా?'' అనేసి వెళ్ళింది.

ప్రసాదరావు మొదటిసారి చిరునవ్వు నవ్వాడు. ''నీ హృదయంలో నాకు స్థానం ఇయ్యి చాలు!'' అనుకున్నాడతను.

5

పదిహేనురోజులు గడిచినాయి. ప్రసాదరావు శరీరమూ, మనస్సూకూడా చాలాభాగం రోగవిముక్తమైనాయి. కల్యాణి ఆప్తబంధువులాగా అతనికి వుపచారాలు చేసింది. మందుకంటే ఎక్కువగా ఆమె ధైర్యవచనాలు ప్రసాదరావు మనస్సుకు ఆందోళన తగ్గించి ఆశరేకెత్తించాయి. ఆమెను ధైర్యంచేసి అడిగితే సరిపోతుంది. రేపో ఎల్లుండో తనను బైటికి పంపించేస్తారు. రేపు సాయంత్రం ఆమె డ్యూటికి రాగానే అడిగేద్దాం... అని అనుకున్నాడతను.

తనను ప్రమాదానికి గురిచేసిన కారుయజమాని పరిహారంకింద ఐదొందలు పంపిస్తానని కబురుచేశాడు. నిన్ననే కళ్యాణి చెప్పింది. తను మరీ వెతుక్కోనక్కర్లేకండా ఆ ఐదొందలతో ఏదో వ్యాపారం చేసుకుని బ్రతకవచ్చు. తను ఉద్దేశించినట్టు కళ్యాణిగూడా అంగీకరిస్తే...

ఆవేళ రాత్రి డ్యూటీకి కల్యాణికి బదులు ఇంకో నర్సు వచ్చింది.

ప్రసాదరావు అడిగాడు: ''కల్యాణి రాలేదేం సిస్టర్?'' అని.

ఆ నర్సు విసుగ్గా '' ఏం? ఆమే కావాలా?'' అన్నది.

''అదికాదు సిస్టర్'' అన్నాడు బ్రతిమాలుతున్నట్టుగా ప్రసాదరావు.

''ఏమిటి కాదు! నాకు తెలీదేమిటి? 'అది' మీ దగ్గిర కొచ్చి కులకడం, నవ్వడం! ఛీ. ఛీ. ఎంత సిగ్గు విడిచేసింది!'' అన్నదామె ఈర్ష్యగా.

''అదేమిటి సిస్టర్ అలా అంటావు? ఆమె సిగ్గు విడిచేసినపను లేమీ చెయ్యలేదే నా దగ్గిర! మీరు పొరపడుతున్నారు'' అని సవరించాడు ప్రసాదరావు.

''నాకెందుకు చెబుతావయ్యా! ఆస్పత్రి అంతా గోలగా వుంటే! మీరు ఆమెను రిజిస్టర్డు మేరేజ్ చేసుకోబోతున్నారటగా!'' అన్నది కొత్తనర్సు అకస్మాత్తుగా.

ప్రసాదరావు మనస్సొక క్షణంపాటు స్తంభించిపోయింది సంతోషంతోటి. ఈ పుకారు ఎలా పుట్టింది? ఎవరితోటి ఐనా కల్యాణి అన్నదేమో! తన వుద్దేశం నిజమే నన్నమాట.

''అది నిజమే ననుకుందాం మాటవరుసకి. దాంట్లో తప్పేంవుంది సిస్టర్?'' అన్నాడు ప్రశ్నార్థకంగా ప్రసాదరావు.

''నాకెందుకండీ అవన్నీ, నిన్నటిదాకా పెద్ద నీతి మంతురాలుగా మాట్లాడుతూ వుండేది అందర్నీ వెక్కిరిస్తూ. అందుకని అడిగాను'' అన్నది కొత్తనర్సు.

అంతకుమైన ఏం మాట్లాడ్డానికీ ఇష్టపడకపోవడంవల్ల వూరుకున్నాడు ప్రసాదరావు. అయితే, అతనికీ సంభాషణ బ్రహ్మాండమైన ఆశ కలిగించింది. తనవుద్దేశం నిజమౌతున్నందుకు తన అదృష్టాన్ని తనే మెచ్చుకున్నాడతను.

ఇటుపైన కల్యాణి ఎప్పుడు కనపడ్డా తనవుద్దేశం వెంటనే బైటపెట్టవచ్చుననే ధైర్యంకూడా కలిగిందతనికి.

కాని మర్నాడూ కల్యాణి రాలేదు. ' ఎందుకని?' అని ఎవర్నడిగినా ఏమీ సమాధానం రాలేదు. ప్రసాదరావుకు ఏదో అకారణమైన భయం పట్టుకున్నది. '' ఏమైంది కల్యాణి? ఎవరూ ఏమీ సమాధానం చెప్పరేమిటి?'' అని విసుక్కున్నాడు.

6

ఆ మర్నాడూ కల్యాణి రాలేదు. ప్రసాదరావును ఆ వేళ ఉదయం పదిగంటలకు బైటికి పంపే ఏర్పాట్లు జరిగాయి. పెద్ద డాక్టర్ స్వయంగా వచ్చి ఐదొందలు చేతికిచ్చి ''వెళ్ళిరా తమ్ముడూ, జాగ్రత్త! ఇది మహానగరం. ప్రమాదాలు తరుచు జరుగుతున్నాయి... రోడ్డుమీద నడిచేవాడు ఎంత జాగ్రత్తగా వున్నా చాలదు...'' అన్నాడు.

ప్రసాదరావు ఆయనకు వందనసమర్పణచేసి, ''కళ్యాణి అని ఒక నర్సు ఉండేది చూడండి... ఆమె ఏది?'' అని అడిగాడు. '' ఆమెకి నేనెంతయినా ఋణపడి వున్నాను. ఆమెతో రెండు మాటలు చెప్పి వెళ్దామనుకుంటున్నాను'' అన్నాడు.

డాక్టర్ అతన్ని ఎగాదిగాచూసి, ''మీకూ, కల్యాణికీ... ఏదో ముడిపెట్టి అందరూ అనుకుంటున్నారిక్కడ నిజమేనా?'' అని అడిగాడు.

ప్రసాదరావు : ''మే మిద్దరం అలాంటిమాటలేం అనుకోలేదండి ఇంతవరకు'' అన్నాడు.

''అయితే నాతోరండి. కల్యాణి లోపల వుంటుంది... గుండె నిబ్బరం చేసుకోండి. కారుప్రమాదాలు ఎక్కువౌతున్నాయండి'' అన్నాడు డాక్టర్.

ప్రసాదరావుకి అకారణంగా గుండెలు దడ దడ లాడసాగినాయి.

డాక్టర్ 'అతి ప్రమాదరమైనకేసులు' వుండే వార్డుకు తీసుకెళ్ళాడు.

ప్రసాదరావు సాధ్యమైనంత త్వరగా నడిచాడు. నాలుగైదు మంచాలు దాటాక ఆగాడు డాక్టర్. కల్యాణియొక్క భౌతిక కాయం తుది మర్యాదలకోసం అక్కడ భద్రంగా వుంచబడింది.

ప్రసాదరావు '' ఆఁ... ఏమిటిది?...'' అంటూ ఆమెని సమీపించాడు.

డాక్టరు అతన్ని ఆపాడు, '' ఆమె కూడా నిన్ను ప్రేమించిదోయ్. నిన్న ఆస్పత్రికొస్తూ బస్ దిగుతూ వెనకనించి వస్తున్న ఇంకో చిన్న కారుకింద పడిపోయింది ఇంతక్రితమే చనిపోయినది. కొనవూపిరితో నీకు 'ధైర్యంగా వుండమని' చెప్పమంది. పాపం! ఆమె ఆత్మశాంతికి ప్రార్థించడంతప్ప ఇప్పుడు మనం చేసేదేమీ లేదు...'' అన్నాడు.

ప్రసాదరావు కుప్పగా కూలిపోయాడు. అతని పదిహేను రోజుల కలల ప్రతిఫలం - దేవత - దాటిపోయింది. ప్రసాదరావు మాటాపలుకూ లేకుండా ఆమె మంచం పక్కనే కూలబడి పోయినాడు.

(కథావాహిని 1955)